## క్లుప్తంగా

### అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారి అశోక్‌కుమార్

**లక్కవరపుకోట:** అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి సిబ్బందికి కొత్తవలస అగ్నిమాపకశాఖ అధికారి అశోక్‌కుమార్ గురువారం అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో రోగులను తప్పించే విధానం, ప్రమా దాన్ని అరికట్టే తీరును ప్రయోగాత్మకంగా వివరించారు. మంటలను అదుపు చేసే అన్ని రకాల పరికరాలను ఆస్పత్రిలో అందుబాటులో ఉంచాలని ఆస్పత్రి యాజమాన్యానికి సూచించారు. ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**లక్కవరపుకోట:** స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి ఖాసాపేట ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనులు నిర్వహించనున్న నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరా యం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ ఐ.కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఖాసాపేట, కొట్యా డ, తలారి, రంగరాయపురం,సంతపేట గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఆర్థిక సహాయం అందజేత


బాధితురాలి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న సంతోష్, వినోద్‌కుమార్

**గుర్ల:** మండలంలోని భూపాలపురం గ్రామానికి చెందిన విద్యార్థిని నైదాన వెంకటలక్ష్మి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమా దంలో తీవ్ర గాయాలపాలయ్యారు. విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో చికిత్స చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన 'చేయిచేయి కలుపుదాం సేవా సంఘం' సభ్యులు స్పందించారు. బాధితురాలికి వైద్య ఖర్చుల కోసం రూ.25 వేలు సహాయం చేశారు. నగదును బాధితురాలి కుటుంబ సభ్యులకు ఆ సేవా సంఘం సభ్యులు సీపాన సంతోష్, బొబ్బిలి వినోద్ కుమార్ విజయనగరంలోని ఆస్పత్రిలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితురాలు వెంకటలక్ష్మికి ఖరీదైన చికిత్స అవసరమని దాతలు సహకరించాలని కోరారు.

### బడి ఈడు పిల్లలను బడికి పంపించండి


జాకేరులో సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు, సర్పంచ్ చిన్నమ్మలు

**వేపాడ:** గ్రామాల్లో చదువుకోకుండా బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను స్కూల్‌లో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు మండలంలో ఇంటింట సర్వే చేస్తున్నారు. జాకేరు గ్రామంలో హెచ్‌ఎం నేతృత్వంలో సర్పంచ్ బుద్దా చిన్నమ్మలు ఉపాధ్యాయులు గురువారం సర్వే చేశారు. బడి ఈడు పిల్లలను పనుల్లో పెట్టకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

### మమ్మురంగా వేసవి దుక్కులు


ట్రాక్టర్‌తో దుక్కు దున్నుతున్న రైతు

**బొండపల్లి:** అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో మండల రైతులు వేసవి దుక్కులు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవని కారణంగా రైతులు ఇంకా మెట్టు భూముల్లో పంటల సాగుకు సిద్ధం కాలేదు. సాధారణంగా మెట్టు భూముల్లో ఇప్పటికే రైతులు పత్తితో పాటు, గోగు, వేరుశనగ, మొక్కజొన్న వంటి పంటల సాగుతో పాటు వరి నారు ముడులు సిద్ధం చేయాల్సి ఉంది. తాజాగా వర్షాలు కురుస్తుండడంతో వరి నారుమడులతో పాటు, మెట్టు భూములను పంటల సాగుకు రైతులు సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఖరీఫ్ వరి సాధారణ సాగు విస్తీర్ణం13,500 హెక్టార్లు కాగా, 10 వేల హెక్టార్లల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. వర్షాలు సకాలంలో కురవక పోవడంతో ఈఏడాది సాగు ఆలస్యం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

# ప్రజాతీర్పును స్వాగతిస్తున్నాం

- వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన 76 వేల మందికి కృతజ్ఞతలు
- నిత్యం క్యాడర్‌కు అందుబాటులో ఉంటాం
- అభివృద్ధి విషయంలో కొత్త పాలకులకు సహకరిస్తాం
- వైఎస్సార్‌సీపీ మండల నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**చీపురుపల్లి:** ఇటీవల జరిగిన ఎన్నికల్లో చీపురుపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన బొత్స సత్యనారాయణకు ఓటు వేసిన 76 వేల మంది ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయు డు, మీసాల వరహాల నాయుడు చెప్పారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ కోసం పని చేసిన కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు రుణపడి ఉంటామన్నారు. ఓటమి చెందామని కార్యకర్తలు ఎలాంటి అధైర్యం పడాల్సిన అవసరం లేదని, మనకు బలమైన నాయకత్వం ఉందని గుర్తు చేశారు. నిరంతరం పార్టీ క్యాడర్‌తో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంస్కర ణలు తీసుకొచ్చారని చెప్పారు. గ్రామాల్లోనే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల ముంగిటకు సేవలు అందించారన్నారు. అంతేకాకుండా నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యా వ్యవస్థలో విప్లవాలు తీసుకొచ్చామని, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేశామని, అయినప్పటికీ ప్రజాతీర్పు దురదృష్టకరమన్నారు. స్థానిక సంస్థల్లో మనమే పాలకులుగా ఉన్న నేపథ్యంలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రయత్నిద్దామన్నారు. కొత్తగా ఎన్నికైన పాలకులకు అభివృద్ధి విషయంలో సహకరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రేవల్ల సత్తిబాబు, పనస అప్పారావు, గిరిడి రాందాసు, కోరుకొండ దాలయ్య, కరణం ఆది, మల్లెంపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే


సర్వే చేస్తున్న ఎంఈఓలు నర్సింరావు, గణపతిలక్ష్మి, ఐఈఆర్‌పీ లీలాకృష్ణ

**శృంగవరపుకోట:** గ్రామాల్లో 2 ఏళ్ల వయస్సు నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సున్న ప్రత్యేక అసరాలు గల పిల్లలను గుర్తించేందుకు ఐఈఆర్‌పీలు సర్వేలు చేస్తున్నారు. మండలంలోని సీతంపేట గ్రామంలో ఐఈఆర్‌పీలు బి.లీలాకృష్ణ, ఆర్.శ్రీకన్య గురువారం నిర్వహించిన ఇంటింట సర్వేను ఎంఈఓలు బి.నర్సింగరావు, పి.గణపతిలక్ష్మి పరిశీలించారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు ఫిజియోథెరపీ సేవలందించే భవిత కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను ఐఈఆర్‌పీలు కోరారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కల్పి స్తున్న వసతులు, రాయితీలు, సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. ఇప్పటి వరకూ మండలంలో 20 మంది ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించినట్లు ఎంఈఓ నర్సింగరావు తెలిపారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, తదితరులు

**విజయనగరం టౌన్:** పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మనందరిపైనా ఉందని సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ రావు అన్నారు. గురువారం స్థానిక తోటపాలెంలో ఉన్న సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రపంచ పర్యావరణాన్ని పురస్కరించుకుని ఎన్‌సీసీ క్యాడెట్లు, కళాశాల అధ్యాపకులు మొక్కలు నాటారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి మాట్లాడుతూ.. మన ఇంటి పరిసరాలను, మన వర్క్‌ప్లేస్‌ను పచ్చదనంతో నింపాలన్నారు. ఇండోర్ మొక్కలను కూడా విరివిగా పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి ఎం. ఉదయ్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

### వైద్య పరీక్షలు చేయించుకోవాలి

**రేగిడి:** గర్భిణులు, చిన్నారులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సోహినీరాఘవ్ తెలిపారు. మండలంలోని వండానపేట, అప్పాపురం, మజ్జిరాముడుపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి ఆరోగ్య తనిఖీలు చేసి, మెరుగైన ఆరోగ్యానికి సూచనలు, సలహాలను ఆమె ఇచ్చారు. ప్రతిరోజూ మనం తినే ఆహారంలో పౌష్టికాహారం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ ఉపకారవేతనానికి ఎంపిక


వేపాడ: సోంపురం హైస్కూల్ విద్యార్థిని హాసినికి అర్హతపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం రాజు

**వేపాడ:** మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఎం.హాసిని జాతీయ ఉపకార వేతనానికి(ఎన్‌ఎంఎంఎస్) ఎంపికై ందని హెచ్‌ఎం బి.పి.ఏ.రాజు తెలిపారు. విద్యార్థినిని పాఠశాలలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ జాతీయ ఉపకార వేతనం కోసం నిర్వహించిన అర్హత పరీక్షలో విద్యార్థిని హాసిని 111 మార్కులు సాధించిందని చెప్పారు. విద్యార్థినికి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12వేల ఉపకార వేతనం అందుతుందన్నారు. విద్యార్థినికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన గణితం,సామాన్య,సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

**కుమరాం పాఠశాల నుంచి 10 మంది ఎంపిక**

**జామి:** మండలంలోని కుమరాం ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు 10మంది జాతీయ ఉపకార వేతనానికి ఎంపికయ్యారని హెచ్‌ఎం పద్మావతి గురువారం తెలిపారు. విద్యార్థులు చేతన్, రూపేష్, చరణ్ తేజ, పల్లవి, హర్షవర్ధన్, సాయికిరణ్, దీక్షిత, రాము, జాస్మిత, పల్లవి స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎంతో పాటు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

## కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300


వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

**రేగిడి:** నిర్దేశిత కొలతల ప్రకారం ఉపాధి హామీ పథకం పనులు చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఏపీవో ఎస్.హరనాథరావు తెలిపారు. మండలంలోని తాటిపాడు, వావిలవలస గ్రామాల్లోని మంచినీటి కోనేరుల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేతనదారులు రెండు పూటలా పనులు చేయాలని, జాబ్ కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలన్నారు. వేరే వారి పేరు మీద ఇతరులను పనిలోకి రానివ్వద్దన్నారు. వడదెబ్బ బారినపడకుండా ఉండాలని, వర్షాలు కురిసే సూచనలు కనిపించినప్పుడు వెంటనే ఇంటికి వెళ్లిపోవాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# దుకాణాలున్నా.. ఆదాయం అంతంత మాత్రమే

- నగరంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న షాపులు
- లైసెన్స్‌లు తీసుకోవడంలో అలసత్వం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న కార్పొరేషన్ అధికారులు


నగరంలోని దుకాణ సముదాయాలు

**విజయనగరం:** కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో పుట్టగొడుగుల్లా దుకాణాలు వెలస్తున్నప్పటికీ ఆ స్థాయిలో ఖజానాకు ఆదాయం సమకూరడం లేదు. రోజురోజుకూ విస్తరిస్తున్న నగరంలో ఎక్కడ పడితే అక్కడ వివిధ రకాల దుకాణాలున్నపటికీ లైసెన్సు లేకుండానే వ్యాపారాలు సాగుతుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రతి ఏడాదీ కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతోంది. నిబంధనల ప్రకారం నగరంలో ఏ దుకాణం నడపాలన్నా కార్పొరేషన్ నుంచి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి. ఇందుకు ప్రభుత్వం నిర్ణయించిన నగదు చెల్లించాల్సి ఉంటుంది. అయితే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లైసెన్స్ మంజూరు ప్రక్రియపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం ఉన్నతాధికారులైనా స్పందించి లైసెన్స్‌ల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించి, ఆదాయం మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**వసూళ్లలో వైఫల్యం...**

కార్పొరేషన్ ఖజానాకు ప్రతి ఏడాదీ ట్రేడ్ లైసెన్స్‌ల రూపంలో రావాల్సిన ఆదాయం అంతంతమాత్రంగానే ఉంది. 2018–19 సంవత్సరం నుంచి పరిశీలిస్తే అప్పట్లో 1600 వరకు దుకాణాలు, షాపులు ట్రేడ్ లైసెన్స్ పరిధిలోకి వస్తే.. 2022–23 సంవత్సరం నాటికి ఆ సంఖ్య 2,219కి చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పాత, కొత్త బకాయిలు కలుపుకుని రూ.1.50 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ.13.23 లక్షలు మాత్రమే వసూలైంది. 2018 – 19 సంవత్సరంలో రూ.18.77 లక్షల డిమాండ్‌కు గాను రూ.12.51 లక్షలు.. 2019- 20లో రూ.20.13 లక్షలకు గాను రూ. 13.52 లక్షలు.. 2020–21లో రూ. 20.39 లక్షలకు గాను రూ.12.13 లక్షలు .. 2021- 22లో రూ.21.49 లక్షలకు గాను రూ. 11.22 లక్షలు.. 2022–23లో రూ. 25.03 లక్షలకు గాను రూ.13.23 లక్షలు మాత్రమే వసూలు కావడం గమనార్హం. అదేవిధంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.24.12 లక్షలకు గాను రూ.12.37 లక్షలు మాత్రమే వసూలు చేయగలిగారు.

**ఆదాయం పెరగదేం...?**

జిల్లా కేంద్రం, ఆపై కార్పొరేషన్ హోదా దక్కించుకున్న నగరం విజయనగరం. ఆ స్థాయికి తగ్గట్లే స్థానిక ప్రజాప్రతినిధులు అన్ని రంగాల్లో నగరాన్ని అభివృద్ధి చేశారు. గడిచిన ఐదేళ్లలో నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు నగర రూపురేఖలు చాలా వరకు మారాయి. పెద్ద పెద్ద నగరాలకు దీటుగా ప్రధాన కూడళ్లు సుందరంగా రూపుదిద్దుకున్నాయి. ఈ భారాన్ని అధిగమించేందుకు వీలుగా ఆదాయ మార్గాలను పెంచుకునే దిశగా చర్యలు చేపట్టడంలో కార్పొరేషన్ యంత్రాంగం విఫలమవుతోంది. రెస్టారెంట్లు, హోటళ్లు, కిరాణా దుకాణాలు, వస్త్ర దుకాణాలు, ఆన్‌లైన్ సెంటర్లు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, కల్యాణ మంటపాలు, మొబైల్ షోరూమ్‌లు, టిఫిన్ సెంటర్లు, వాహన షోరూమ్‌లు, రిపేర్ సెంటర్లు, తదితర దుకాణాలు ట్రేడ్ లైసెన్స్ పరిధిలోకి వస్తుండగా... ఆ స్థాయిలో ఆదాయం మాత్రం సమకూరడం లేదు.

**ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి**

నగరంలో వ్యాపారాలు సాగించే ప్రతి దుకాణదారుడు, వాణిజ్య సంస్థల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు సాగిస్తే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. విస్తరిస్తున్న నగరంలో రోజురోజుకూ దుకాణాల సంఖ్య పెరుగుతోంది. వ్యాపారులు ముందుకొచ్చి అనుమతి తీసుకోవాలి. లేని పక్షంలో చర్యలు తప్పవు.

– ఎం.మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్

## లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


జామి: కుమరాంలో పూజలందుకుంటున్న లక్ష్మీ నరసింహస్వామి


బొండపల్లి: దేవుపల్లిలో పూజలందుకుంటున్న శనీశ్వర స్వామి


గజపతినగరం: ఎం.వెంకటాపురంలో షిర్డీ సాయికి పూజలు చేస్తున్న భక్తులు

**జామి:** కుమరాం గ్రామం, కల్యాణ్‌నగర్‌లోని ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఆలయ వార్షికోత్సవం చేసి 16 రోజులు పూర్తయిన సందర్భంగా వేడుకలు చేశారు. స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేసి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

**శనీశ్వరస్వామి జయంతి**

**బొండపల్లి:** దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో గురువారం శనీశ్వరస్వామి జయంతి నిర్వహించారు. జిల్లా నలుమూలలు నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో అర్చకు లు ధూసి శ్రీధర్ శర్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న శనీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు చేయించారు.

**షిర్డీసాయి ఆలయాలలో..**

**గజపతినగరం:** ఎం.వెంకటాపురం, పురిటిపెంట మారుతీనగర్ కాలనీల్లోని షిర్డీసాయి ఆలయాల్లో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులతో అర్చకులు అనిల్‌కుమార్ శర్మ,బాబి అభిషేకాలు, పూజలు చేయించారు.

## ముగిసిన వేసవి శిబిరం


బహుమతులు అందుకున్న క్రీడాకారులతో తల్లిదండ్రులు, గ్రామపెద్దలు

శృంగవరపుకోట: ధర్మవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 30 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణా శిబిరం గురువారంతో ముగిసింది. ఇటీవల నిర్వహించిన టోర్నమెంట్లలో విజేతలైన క్రీడాకారులకు ముగింపు ఉత్సవానికి ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. చిన్నారులు పస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. క్రీడాకారులకు పాలు, గుడ్లు, క్రీడాదుస్తులు, షటిల్స్, కాక్స్ అందజేశారు. ఈసందర్భంగా అతిథులు మాట్లాడుతూ శిబిరంలో నేర్పిన శిక్షణ వదిలేయకుండా నిత్యం సాధన చేసి, ఉన్నత లక్ష్యాలను సాధించాలని క్రీడాకారులకు సూచించారు. హెచ్‌ఎం బంగారు ఉమామహేశ్వరరావు, ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ షేక్ వలీఖాన్, స్థానిక పెద్దలు టి.గోవింద, ఏ.మహాలక్ష్మినాయుడు, పి.వెంకటరావు, ఎల్లారావు, రేపాక రాజా, కాపుగంటి సతీష్, ఎస్.సతీష్, పాఠశాల పీడీ డాక్టర్ శ్రీరాములు, ఉపాధ్యాయులు రహీం, ఎల్.వి.సత్యన్నారాయణ, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విజ్ఞానం పెంచుతూ...వినోదాన్ని అందిస్తూ..


కొత్తవలస:విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ రామలక్ష్మి


లక్కవరపుకోట: విద్యార్థులతో కథలు చెప్పిస్తున్న లైబ్రేరియన్ మేరీ నిర్మల


వేపాడ: ఇంటర్‌నెట్ వినియోగంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

**లక్కవరపుకోట/కొత్తవలస:** వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న శిబిరాలు విద్యార్థు లకు విజ్ఞానం పెంచడంతో పాటు వినోదాన్ని అందిస్తున్నాయి. లక్కవరపుకోట, కొత్తవలస గ్రంథాలయాల్లో లైబ్రేరియన్‌లు బి.మేరీ నిర్మల, మీసాల రామ లక్ష్మి విద్యార్థులతో గురువారం పుస్తక పఠనం చేయించారు. అలాగే వారికి నీతి కథలు చెప్పారు. ఇప్పటికే ఆట, పాటలు, తదితర పోటీలు నిర్వహించారు. శిబిరాలు శుక్రవారంతో ముగియను న్నాయని గ్రంథాయాల అధికారులు తెలిపారు.

**ఇంటర్‌నెట్‌పై అవగాహన**

**వేపాడ:** వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు లైబ్రేరియన్ చంద్రశేఖర్ ఇంటర్‌నెట్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఇది వర కు శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేయనున్నామని లైబ్రేరియన్ తెలిపారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు.

## స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన


పిల్లలతో ఇంగ్లిష్ పదాలు రాయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

**తెర్లాం:** ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే స్పోకెన్ ఇంగ్లిష్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి విద్యార్థులకు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్‌పై గురువారం అవగాహన కల్పించారు. శిబిరానికి హాజరైన విద్యార్థులతో ఇంగ్లిష్ పదాలు చదివించడం, రాయించడం, వాటి అర్థాలు చెప్పడం వంటివి చేయించారు. స్పోకెన్ ఇంగ్లిష్ బాగా నేర్చుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ చిన్నతనం నుంచి ఇంగ్లిష్ మాట్లాడడం అలవాటుగా చేసుకోవాలన్నారు. అనంతరం పుస్తకాల ప్రదర్శన చేపట్టి, చిన్నారులతో కప్పగెంతులు ఆట ఆడించారు. కార్యక్రమంలో పాఠశాల క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

**నెల్లిమర్ల:** నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు, కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.